క్లుప్తంగా

పలువురికి పరామర్శ



గుమ్ములూరులో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న విజయలక్ష్మి

మధురపూడి: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆదివారం కోరుకొండ మండలంలోని పలు కుటుంబాలను పరామర్శించారు. గుమ్ములూరులో మాజీ సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు తమ్ముడు వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని ఆమె పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే రాయుడు రమణ, ఇజ్జిన నాగేంద్రలు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాలను విజయలక్ష్మి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

సీతానగరం: కూనవరంలో మద్యం విక్రయిస్తున్న అడపా దుర్గాప్రసాద్‌పై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ బి.లక్ష్మణరావు శనివారం తెలిపారు. 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని, దుర్గాప్రసాద్‌ను కోర్టులో హాజరుపర్చుతామని అన్నారు.

పంటగలా వచ్చింది

సాగులో కష్టాలు.. కన్నీళ్లే మిగిలిన సమయంలో పండగలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చింది.. వ్యవసాయం దండగ అన్న టీడీపీ అధినేత చంద్రబాబులా కాకుండా సాగులో సిరులు కురిపించేలా జగనన్న ప్రభుత్వం బాటలు వేసింది.. తద్వారా వ్యవసాయం కొత్త పుంతలు తొక్కుతోంది.. సాగు బంగారమైంది.. వైఎస్సార్ యంత్ర సాయం, సాగు రుణాలు, రైతుల భరోసా వంటి పథకాలు కొండంత ఆసరాగా మారాయి.. నేడు ముంగిటకే వచ్చిన రైతు భరోసా కేంద్రాలతో అన్ని సేవలూ సకాలంలో అందుతున్నాయి.

- టీడీపీ హయాంలో సాగులో కన్నీళ్లు
- వైఎస్సార్ సీపీతో సంక్షేమ పరవళ్లు
- రాయితీపై ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు

రాజానగరం: మెట్టలోనూ బంగారం పండించేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాటలేశారు.. అన్నదాతలకు అడుగడుగునా అండగా నిలుస్తా నేనున్నాననే 'భరోసా' ఇచ్చారు. సీఎంగా జగన్ బాధ్యతలు చేపట్టింది మొదలు నాలుగేళ్లుగా రైతు సంక్షేమానికి బాటలు వేస్తున్నారు. రాజానగరం మండలంలో 6,680 హెక్టార్లలో సాగు జరుగుతోంది. మొత్తం 18 వేల మంది రైతులు ఉన్నారు. ప్రధానంగా వరి, పొగాకు, అపరాలు, కూరగాయలు వంటి అనేక రకాల పంటలు పండిస్తున్నారు. డెల్టాలో మాదిరిగా ఇక్కడ సాగునీటి సదుపాయాలు ఉండవు. వర్షాలే ఆధారం. చాలామంది రైతులు బోర్ల ద్వారా సేద్యం చేస్తుంటారు. బోరు సదుపాయం లేని సన్న, చిన్నకారు రైతులు పెద్ద రైతుల నుంచి నీటిని కొనుగోలు చేసి సాగు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వీటిని గ్రహించిన సీఎం జగన్ 'జలకళ' పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా ఆసక్తి ఉన్న సన్న, చిన్నకారు రైతులు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వమే ఉచితంగా బోర్లు వేయిస్తుంది. ఇలా రాజానగరం మండలంలో 28 బోర్లు వేశారు. ఇవి కాకుండా ఇప్పటికే ఉచిత విద్యుత్ పథకాన్ని అందుకుంటున్న బోర్లు 5,204 వరకూ ఉన్నాయి.

పథకాలు.. ప్రయోజనాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎత్తిపోతల పథకాలకు మహర్దశ పట్టింది. రాజానగరం మండలంలో భూములకు సాగునీటిని అందించే పుష్కర, చాగల్నాడు ఎత్తిపోతల పథకాల నిర్వహణకు గాను ఏటా నిధులు కేటాయిస్తూనే ఉన్నారు. ఈ ఏడాది పుష్కరకు రూ. కోటి, చాగల్నాడుకు రూ.2 కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఎప్పటికప్పుడు రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులను కలుసుకుని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. సాగునీటి చెరువుల ఆధునీకరణకు మైనర్ ఇరిగేషన్ ద్వారా రూ. 39 కోట్లు మంజూరయ్యాయి. వీటితో 53 పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. 'రుడా' ద్వారా నియోజకవర్గానికి మంజూరైన రూ. 1.87 కోట్ల నుంచి మండలంలోని తొకాడ, ఊరచెరువుకు ఆధునీకరణకు రూ.52 లక్షలు కేటాయించారు. ఇవి కాకుండా మైనర్ ఇరిగేషన్, ఎన్ఆర్ఈజీఎస్ పథకాల ద్వారా మండలంలో రూ. 44.5 కోట్లతో 122 చెరువులను ఆధునీకరించారు. మండలంలో రైతులకు ప్రభుత్వం 26 ట్రాక్టర్లు, 2 కంబైన్డ్ హార్వెస్టర్స్‌ను పంపిణీ చేసింది. రూ.1.56 కోట్ల విలువైన 26 ట్రాక్టర్లను, రూ.56 లక్షలలో రెండు హార్వెస్టర్స్‌ను పంపిణీ చేశారు. ట్రాక్టర్ల ఖరీదులో రూ. 52 లక్షలు రాయితీ కాగా, మిగిలిన రూ.10.40 లక్షలను రైతులు తమ వాటాగా భరించాల్సి ఉంది. రెండు హార్వెస్టర్స్ ఖరీదులో రూ.17.6 లక్షలు రాయితీ కాగా మిగిలిన రూ. 38.4 లక్షలు రైతులు వాటాగా చెల్లించారు.



సంపత్‌నగరంలో రైతు భరోసా కేంద్రం

ఆర్బీకేలతో సేవలు చేరువ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) ద్వారా సేవలు అందుబాటులోకి వచ్చాయి. రాజానగరం మండలంలో 27 ఆర్‌బీకేలు ఉన్నాయి. ఇందులో సిబ్బంది రైతులకు అవసరమైన వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నారు. భూసార పరీక్షలు చేయించడం, పంటల బీమా, ఈ క్రాప్ బుకింగ్, ధాన్యం కొనుగోలు వంటివి చేపడుతున్నారు. పశువులకు వైద్య సహాయం అందించడం, పశు బీమా అమలు, వాటికి కావలసిన సంపూర్ణ దాణాకు సంబంధించిన విత్తనాలను సరఫరా చేయడంలోనూ ఆర్బీకేలు విశేష సేవలందిస్తున్నాయి. రైతు భరోసా పథకం ద్వారా మండలంలోని 8,500 మంది రైతులకు ఏడాదికి సుమారు రూ.9.5 కోట్ల చొప్పున నాలుగేళ్ల నుంచి రూ.38.24 కోట్ల సొమ్ము అందించారు.



వ్యవసాయ బోరు ద్వారా సాగవుతున్న పొలం

నిజంగా రైతు ప్రభుత్వమే..



గతంలో ఏ ప్రభుత్వమూ మా సంక్షేమానికి బాటలు వేయలేదు. విపత్తులు సంభవించినప్పుడు తీవ్రంగా నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకుని, తమది నిజంగానే రైతు ప్రభుత్వమని సీఎం జగన్ నిరూపించారు. గతంలో నష్ట పరిహారం నివేదికల తయారీకే సంవత్సరాలు పట్టేది. ఇప్పుడు నెల రోజుల్లోనే నష్ట పరిహారం సొమ్ము నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే పడుతోంది.

–సేనాపతి వెంకటరమణ, రైతు, సీతారామపురం

అప్పట్లో విస్మరించారు



గతంలో చంద్రబాబు వ్యవసాయాన్ని పూర్తిగా విస్మరించారు. దేశ వ్యాప్తంగా వ్యవసాయ రంగంలో ఆధునికత వచ్చినా చంద్రబాబు పట్టించుకోలేదు. కనీసం రైతులకు ఆధునిక వ్యవసాయ పనిముట్లు సరఫరా చేయలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో వ్యవసాయం పండుగలా మారింది. ఇప్పుడు అన్నీ అందుబాటులోకి వచ్చాయి.

–తీగిరెడ్డి వెంకన్న, రైతు, ముక్కినాడ

విప్లవాత్మక మార్పులు



రాష్ట్ర వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. నాలుగేళ్లుగా సాగు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో లాభదాయకంగా మారింది. ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా అనేక రకాలుగా రైతులకు చేయూత ఇస్తుంది. ఆధునిక వ్యవసాయ పనిముట్లు సరఫరా చేసి, అధిక దిగుబడులు సాధించే దిశగా తోడుగా నిలుస్తుంది.

–చెల్లూరి రుద్రం, రైతు, సంపత్‌నగరం

చిట్టీల పేరుతో ఘరానా మోసం

- అధిక వడ్డీ ఎర చూపి రూ.1.50 కోట్లకు కుచ్చుటోపీ
- పోలీసులకు ఫిర్యాదు
- ఎమ్మెల్యే కన్నబాబుకు గోడు చెప్పుకొన్న బాధితులు



ఎమ్మెల్యే కన్నబాబుకు గోడు చెప్పుకుంటున్న బాధితులు

కరప: ఎంతో నమ్మకంతో చిట్టీలు వేస్తూ, ఆపై అధిక వడ్డీ ఎర వేసి రూ.1.50 కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన ఓ వ్యాపారి పలాయనం చిత్తగించాడు. కరప మండలం వేములవాడలో ఈ సంఘటన చోటు చేసుకుంది. బాధితులు, కరప పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గండి కామేశ్వరరావు, అతడి కుమారుడు దుర్గరాజు చాలా కాలం నుంచి కిరాణా వ్యాపారం చేస్తున్నారు. తర్వాత చిట్టీల వ్యాపారం మొదలు పెట్టి, గ్రామస్తులకు నమ్మకం కలిగించారు. డ్వాక్రా మహిళలు, ఉపాధి కూలీలు, చిరు ఉద్యోగులు, రైతులకు అధిక వడ్డీ ఎర చూపించి, సొమ్ములు తీసుకునేవారు. చిట్టీలు పాడుకున్న వారి డబ్బులు కూడా వడ్డీ పేరుతో తనవద్దే ఉంచేసుకునేవారు. మధ్యమధ్యలో వడ్డీలు చెల్లించడంతో గ్రామస్తుల్లో బాగా నమ్మకం ఏర్పడింది. దీంతో వేములవాడతో పాటు కరప, వేళంగి, జి.వేమవరం, రామచంద్రపురం తదితర గ్రామాలకు చెందిన వారి నుంచి సుమారు రూ.1.50 కోట్లు సేకరించిన కామేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలసి పలాయనం చిత్తగించాడు. కొంత కాలం నుంచి వారు కనిపించకపోవడంతో పని మీద ఊరికి వెళ్లి ఉంటారని గ్రామస్తులు భావించారు. పది రోజుల క్రితం కామేశ్వరరావు వచ్చి, గుట్టు చప్పుడు కాకుండా ఇంట్లోని సామాన్లు తీసుకుని వెళ్లిపోయాడు. మరో ఇంట్లో ఉన్న సామాన్లను అతడి కోడలు భవాని ఆటోలో తీసుకువెళ్లిపోతూంటే అనుమానం వచ్చి, గ్రామస్తులు నిలదీశారు. దీంతో అసలు విషయం బయటపడింది. ఆమెను గ్రామస్తులు కరప పోలీసులకు అప్పగించారు. తీసుకున్న సొమ్ముల్ని వాయిదాల పద్ధతితో తీరుస్తామని పెద్దల సమక్షంలో కాగితం రాసివ్వడంతో పోలీసులు వారిని వదిలేశారు. అనంతరం కామేశ్వరరావు కుటుంబ సభ్యులు గ్రామస్తుల కళ్లుగప్పి బిచాణా ఎత్తేశారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలంటూ బాధితులు శనివారం కరప పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం కరప వచ్చిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబును సర్పంచ్ కమిడి మంగాదేవి, శంకర్‌తో కలిసి ఆశ్రయించి తమ గోడు చెప్పుకొన్నారు. మోసగాళ్లను పట్టుకుని బాధితులకు న్యాయం చేయాలని కరప ఎస్సై ఎస్.రామకృష్ణను ఎమ్మెల్యే ఆదేశించారు. కామేశ్వరరావు మాయమాటలు నమ్మి రూ.14 లక్షలు ఇచ్చానని, చిట్టీల సొమ్ము రూ.5 లక్షలు రావాలని వేములవాడకు చెందిన శ్రీపాద లక్ష్మి విలపిస్తూ తెలిపింది. రూ.5 లక్షల వరకూ చిట్టీ సొమ్ము రావాలని మరో బాధితురాలు పడాల భవాని తెలిపింది.

పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములవ్వాలి

అనపర్తి: పరిసరాల పరిశుభ్రతలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మండలంలోని లక్ష్మీనరసాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగబాబు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జన్ భాగీదరి కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం లక్ష్మీనరసాపురం స్కిల్ హబ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు గురుకుల పాఠశాల, కళాశాల, వసతిగృహ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో పీకేఎస్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై కళాజాత

సీతానగరం: పర్యావరణ పరిరక్షణపై సీతానగరంలో నిర్వహించిన కళాజాత ఆకట్టుకుంది. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు పర్యావరణ దినోత్సవం సందర్భంగా శనివారం సీతానగరం బస్టాండ్ సెంటర్ వద్ద వీధి నాటికలు నిర్వహించారు. విభూతి బ్రదర్స్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో మ్యాజిక్ షో, హాస్య సన్నివేశాలతో కళాజాత జరిగింది. ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలను వివరించి ప్రజల్లో చైతన్యం నింపారు. వస్త్ర సంచులనే వాడాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బృంద సభ్యులు వి.చిన్నారావు, వి.రఘురామ్, వి.శిరీష వివరించారు.

వైభవంగా ఆదిత్యుని ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ

పెదపూడి: జి.మామిడాడ శ్రీ ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి స్వామివారి ఆలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ, శ్రీవారి వార్షిక కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపన చేశారు. పండితులు రేజేటి రామాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి శాంతి కల్యాణం, పూర్ణాహుతి, గ్రామోత్సవం జరిపారు. వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచ్ ఎం.తాతారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామికి లక్షపత్రి పూజ

పెదపూడి శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కె.వెంకట్రావు ఆధ్వర్యంలో పది మంది రుత్వికులు స్వామికి ఉదయం ప్రత్యేక, విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు లక్షపత్రి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు

ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే

అనపర్తి: స్థానిక పాతవూరులో పునఃనిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీజనార్దన స్వామివారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు జరగనున్నాయి. దశాబ్దాల చరిత్ర గల ఈ ఆలయం జీర్ణావస్థకు చేరడంతో ఎమ్మెల్యే సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానం మంజూరు చేసిన 1.48 కోట్లు, దాతల సహకారంతో సమకూర్చిన రూ.1.52 కోట్లు కలిపి మొత్తం రూ.3 కోట్ల అంచనా వ్యయంతో ఆలయ పునఃనిర్మాణాన్ని చేపట్టారు. దీంట్లో భాగంగా ఆదివారం నుంచి ప్రారంభం కానున్న ఆలయ జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ, విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శనివారం పరిశీలించారు.

నేటి నుంచి అంకాలమ్మ జాతర

మధురపూడి: కోరుకొండ గ్రామ దేవత అంకాలమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 6వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముఖ్య అతిథిగా హాజరవుతారని కమిటీ సభ్యులు తెలిపారు. 5న గరగ నృత్యాలు, నవదుర్గల బొమ్మలతో ఊరేగింపు ఉంటుందన్నారు. 6న నైవేద్యాలు సమర్పిస్తారన్నారు.

గాడాలలో అన్నసమారాధన

గాడాలలోని వినాయక వెంకటసాయి ఆలయాల ఆవరణలో శనివారం భారీ అన్న సమారాధన జరిగింది. శ్రీవారి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

నేడు దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలో పంటపాలాల వద్ద ఉన్న దుర్గమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

వినియోగదారులకు అందుబాటులో ఎస్‌బీఐ సేవలు

పెదపూడి: భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) ద్వారా వినయోగదారులకు అందుబాటులో మెరుగైన సేవలు అందిస్తున్నామని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ తపారెస్ బెహరా తెలిపారు. పెదపూడి గ్రామ సచివాలయం వద్ద స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ ఆధ్వర్యంలో ప్రజలు, ఎస్‌బీఐ ఖాతాదారులకు ఎస్‌బీఐ అందిస్తున్న కొత్త పథకాల సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తపారెస్‌బెహరా మాట్లాడుతూ వివిధ పథకాలపై ఖాతాదారులకు అందిస్తున్న అధునాతన సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కె.మునీందర్‌రావు, సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, సచివాలయం కార్యదర్శి మన్యం శ్రీనివాసు చౌదరి తదితరులు పాల్గొన్నారు

'బంగారు కొండ'తో చిన్నారులకు మేలు

సీతానగరం: చిన్నారుల్లో పోషకాహార లోపం నివారణకు బంగారు కొండ కార్యక్రమం దోహదపడుతుందని ఎంపీడీఓ కె.రమేష్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బంగారు కొండ కార్యక్రమంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 54 మంది పిల్లలు పౌష్టికాహారం లోపంతో ఉన్నారని గుర్తించామన్నారు. వీరికి ఆరు నెలల పాటు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తుందని, జిల్లా కలెక్టర్ ద్వారా కిట్‌లు అందుతాయన్నారు. ప్రతి వారం పిల్లల ఎత్తు, బరువు, ఆరోగ్యం వంటివి గమనిస్తుంటారని అన్నారు. బంగారు కొండ కార్యక్రమాన్ని సమష్టిగా విజయవంతం చేద్దామని ఆయన కోరారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల సుజీరాజు, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు పాల్గొన్నారు.



బంగారు కొండ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రమేష్

సైక్లింగ్‌తో ఎన్నో ప్రయోజనాలు

రంగంపేట: రోజూ సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్య పరంగా ఎన్నో ప్రయోజనాలున్నాయని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డి.లావణ్య అన్నారు. శనివారం ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి, ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి గ్రామంలోని పలు వీధుల్లో సైకిల్ ర్యాలీ చేస్తూ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సైకిల్ తొక్కడం వల్ల కండరాలు దృఢంగా తయారవ్వడంతో పాటు ఎముకలు గట్టి పడతాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కె.జయమణి, ఎంపీహెచ్ఈఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'నన్నయ'లో..

రాజానగరం: శరీరక వ్యాయామానికి సైక్లింగ్ ఎంతగానో ఉపయుక్తమని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్‌వర్మ అన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీ ప్రాంగణంలో శనివారం సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. మన పూర్వీకులు ఎక్కువగా సైకిల్ తొక్కేవారని, అందుకే వారు ఆరోగ్యంగా ఉండేవారన్నారు. సైకిల్ తొక్కడం వల్ల వాయు కాలుష్యాన్ని కూడా నివారించవచ్చన్నారు. యూనివర్సిటీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, ఎ.ముత్యాల శిరీష, డాక్టర్ డి.అప్పలరాజు, డాక్టర్ డీఆర్ఎస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో సైకిల్ ర్యాలీ